**అలారం అదే పనిగా మ్రోగుతోంది. రాత్రంతా ఆలోచనలతోటి వేగిపోయి బుర్ర వేడెక్కి అప్పుడే కాస్త కునుకుపట్టిన శంకర్రావుకు అలారం ఆపాలని కూడా అనిపించలేదు. వళ్ళంతా విస్సత్తువగా వుంది. అలాగే కళ్ళుమూసుకుని పడుకున్నాడు. కళ్ళనుండి వేడినీళ్ళు కారి దిండు తడిపేస్తున్నాయి. కన్నీళ్ళు తుడుచుకోవాలనీ అనిపించలేదు. పడక్కి కరుచుకొని పడుకున్నాడు.**

# నేను పతివ్రతను కాను

అరుణ గల్లా

ఆఫీస్‌కి 'సిక్' కాల్ చేద్దామనిపించింది. అయితే యింట్లో వుండిమటుకు ఏం చెయ్యాలి? రంపపుకోతల్లాంటి ఆలోచనల్ని తప్పించుకోవాలంటే ఆఫీసుకెళ్ళటమేనయం. వెంటనే లేచి తూలుతూ అద్దంముందు నిలబడ్డాడు. తన ముఖం తనకే భయంకరంగా కన్పించింది. జుట్టు పలచబడిపోవటం మూలాన చెదురునదురుగా అక్కడక్కడ వెంట్రుకలు అస్తవ్యస్తంగా వున్నాయి. కళ్ళు ఎర్రబడి, ముఖం, తనుచేసిన పాపాలకు ప్రతీకలా కనిపిస్తోంది. ముఖం అద్దం దగ్గరగా పెట్టి మరీ మరీ చూసుకున్నాడు. మార్పేమీలేదు.

వెంటనే షవర్ తీసికుని గడ్డం గీసుకుని బట్టలేసుకొని రెడీ అయి మొహం చూసుకుంటే కాస్త నయం అనిపించింది. తన మామూలు రూపం తనకి కనబడుతోందని పించింది.

నిద్ర లేవగానే ముఖం చూస్తే, కొంత మంది దేవతా శిల్పాల్లా వుంటే, మరి కొంత మంది భయంకరంగా వుంటారు. బహుశః వాళ్ళవాళ్ళ ఆలోచనలు పొద్దున్నే అద్దంలా వాళ్ళ ముఖాల్లో కన్పించిపోతాయేమో!

* * *

ఎక్కడ విశాల, ఎక్కడ అమెరికా! ఎంత మరిచిపోదామన్నా మరపురావటల్లేదు రాత్రి సంఘటన. డైనింగ్ టేబుల్ దగ్గిర అన్నం పెట్టుకుంటూ వుంటే పరిచయం చేశారు. "ఈయన శంకర్రావుగారు. చాలా కాలం నించీ అమెరికాలో వుంటున్నారు, పిమోరియాకి కొత్తగానీ. ఈవిడ విశాల గారు. ఈ మధ్యే ఇండియా నుంచి వచ్చారు. వీళ్ళబ్బాయి లూథరన్ హాస్పిటల్లో రెసిడెంటు" అంటూనన్న సుబ్బారావు పరిచయ వాక్యాలు వింటూ తలెత్తి చూశాడు శంకర్రావు. విశాల.... తన భార్య.... తన చేతిలో ప్లేటూ, అన్నం గరిటెతోసహా శంకర్రావు బిగుసుకుపోయాడు ఒక్క నిముషం. విశాల తడబడింది ఒక్క క్షణం మాత్రం. తర్వాత మామూలుగా నమస్కారం చేసి వెళ్ళిపోయింది. ఇక ఆ పార్టీలో ఎక్కువసేపు ఉండలేకపోయాడు శంకర్రావు. రెండు మూడు సార్లు విశాల కన్పిస్తుందేమోనని అటూ, ఇటూ తిరిగాడు.కానీ ఆమె ఎక్కడా కన్పించలేదు.... ఇంటికి తిరిగొచ్చిందగ్గర్నుంచీ ఎన్నో ఆలోచనలు ....ఎంతో బాధ ... సుబ్బారావు చెప్పిందాన్ని బట్టి చూస్తే విశాల కొడుకు— తన కొడుకు వినోద్ డాక్టరు! ఎంతో తియ్యని మాట! తన కొడుకు పెరిగి పెద్దయి డాక్టరయ్యాడన్న విషయం తలచుకుంటే ఉప్పొంగిపోయింది మనసు. ఆలోచనల నుంచి బయటపడి వెంటనే ఆఫీసుకెళ్ళాడు. వెళ్ళాడే కానీ, ఏ పనీ నిలకడగా చెయ్యలేకపోతున్నాడు. విశాలతో మాట్లాడాలనిపించింది. వెంటనే సుబ్బారావు భార్యకి ఫోన్ చేసి "వినోద్" నెంబర్ కావాలని తీసుకున్నాడు. రాత్రంతా నిద్రలేకపోవటం వల్ల కళ్ళు మండిపోతున్నాయి. ఫోను నెంబరు రాసిన కాయితం చూస్తుంటే ఏదో వణుకు .... ఆఫీసు నుంచి ఫోను చెయ్యలేననిపించింది శంకర్రావుకి. సిక్‌లీవ్ పెట్టి యింటికొచ్చాడు. గంటనుంచీ ఫోను నెంబరున్న కాయితం పట్టుకొని ఫోను ముందు కూర్చున్నాడు. ఓ రెండు సార్లు మొదటి మూడు నెంబర్లూ డయల్ చేసి మళ్ళీ ఫోను పెట్టేశాడు. ఇన్ని సంవత్సరాల తర్వాత, తను కాదని వదిలి వచ్చేసిన తన భార్య విశాలకి యిప్పుడు ఫోను చెయ్యాలంటే ఏదో జంకు...ఎల్లాగయితేనేం,గొంతు సవరించుకుంటూ విశాలకి డయల్ చేశాడు. అవతలినించి "హలో" అని విన్పించింది. ఆమె స్వరం వింటూంటే గొంతులోంచి మాటలు బయటికి రావటంలేదు. మళ్ళీ అటు నుంచి "హల్లో! ఎవరండీ!! ఎవరు కావాలి?" అన్న ప్రశ్న. అతి కష్టం మీద "విశాలా! నేను శంకరాన్ని" అనగలిగాడు. తర్వాత గొంతు పట్టుకుపోయినట్టయి మాట పెగల్లేదు. అవతలివేపు నుంచీ మౌనం. "నన్ను గుర్తుపట్టావా విశాలా హలో! విశాలా! ఉన్నావా!" "ఉన్నానండీ! బాగున్నారా?" "అబ్బ! గుర్తుపట్టావన్న మాట!" "మరిచిపోవటమంటూ జరిగితేగా, గుర్తుపట్టటానికి!" ఆ మాట అమృతంలా వుంది శంకర్రావుకి.

"ఎంత మంచిదానివి విశాలా!" అన్నాడు మెత్తగా. విశాల నవ్వింది ఆ మాటలకి. అది మామూలు నవ్వుకాదు. యుగయుగాల నుంచీ మగవాడిచేతిలో మోసపోయినఆడది, ఆ మగవాడే స్వార్థంతో మంచితనం అంటగడుతూంటే, బాధతో నిండిన గుండెతో ఏమనడానికీ తోచక నవ్విన నవ్వు.

"మన వినోద్ డాక్టరయ్యాట్టగా! ఎంత మంచివార్త విశాలా! నిన్ను కలుసుకోవాలి, నీతో మాట్లాడాలి. ఎప్పుడు? ఎక్కడ! ఎలా వీలవుతుంది?" అన్నాడు శంకర్రావు.

మళ్ళీ నవ్వింది విశాల. కొన్ని వందల మంది జనంలో "నీవే నా భార్యవ"ంటూ తాళిగట్టిన భర్త. ఏడేళ్ళు తనతో కాపరం చేసిన భర్త. ఎక్కడ కలుసుకోవాలీ అని అడగవలసివచ్చిన దుర్దినాన్ని చూసి. జీవంలేని నవ్వు నవ్వింది.

"చెప్పు విశాలా!" "కలుసుకోవడం దేనికండీ!" గొంతు పెగల్చుకుని అంది విశాల." అదేమిటి! అలా అంటావు? ఇరవై ఏళ్ళ తర్వాత కనిపించి. కల్పుకోడం ఎందు కంటావేంటి?" అన్నాడు శంకర్రావు.



"అందుకే నాకు కలుసుకోవడం యిష్టం లేదండీ!" "విశాలా! నీవేనా మాట్లాడేది?" "ఔనండీ! నేనే! విశాలను! వినోద్ తల్లి ని. మన మధ్య మాట్లాడుకోదగ్గ విశేషాలున్నా యని నేననుకోవటంలేదు. ఉంటానండీ! పనిలో వున్నా" అంటూ వెంటనే ఫోను పెట్టేసింది. శంకర్రావు నిర్జీవంగా సోఫాలో వాలి అలాగే వుండిపోయాడు.

* * *

ఇరవై ఏళ్ళ పై మాట! అమెరికాకు కొత్తగా వస్తూ మద్రాసులో ఓరియంటేషన్ సెమినార్‌కి వెళ్ళారు. అక్కడ కల్సింది రేణు. ఇద్దరూ ఒకే యూనివర్శిటీకి వెళ్తు న్నట్టు తెల్సుకొని సంతోషించారు. అమెరి కాలో రేణు సాన్నిధ్యంలో విశాల రాను రాను అంతర్ధానం అయింది. వచ్చేటప్పుడు విశాల ఫొటో బెడ్‌రూమ్‌లో సైడ్ టేబిల్‌ని అలంకరించటం కోసం తెచ్చుకున్నాడు....

బాబ్డ్ హెయిర్‌తో, ముఖం నిండా మేకప్‌తో. రోజుకో రకం డ్రస్‌లో నవ్విస్తూ కవ్విస్తూ తిరిగే రేణు ముందు. నున్నగా తల దువ్వుకొని పెద్ద బొట్టుతో నేత చీరలో విశాల బొమ్మ అమ్మవారిలా కనిపించటం మొదలెట్టింది. ఫొటో పెట్టె

అడుక్కుపోయింది. ఆనాడే ఆమె జ్ఞాప కాలు కూడా అడుగంటినాయి. పొరపాటున విశాల ఎప్పుడన్నా గుర్తుకొస్తే 'ఆ అమ్మ వారితో ఏడేళ్ళు ఎలా కాపరం చేశానా' అని అనిపించేది. అదృష్టవంతుడు కాబట్టి. రేణుతో పరియం ప్రణయంగా మారిందని పించేది. సంవత్సరం తర్వాత ఇండియా వెళ్ళాడు. ఇంట్లో నెమ్మదిగా ఈ విషయం బయటపెట్టాడు. అందరూ నెత్తి నోరూ బాదుకున్నారు. విశాల కాళ్ళా వేళ్ళా పడింది. ఏదీ తనని కదిలించలేకపోయింది. రేణుని పెళ్ళి చేసుకొని అమెరికాలో సెటిల్ అయి పోయాడు.

కొన్నాళ్ళు చాలా బాగా గడిచింది. ప్రపంచంలోకల్లా ప్రణయమూర్తులు తామే నని సంతోషపడ్డారు. తమంత అదృష్ట వంతులు లేరని మురిసిపోయారు. కని పెం

మనిషిని
ఆహ్లాద పరిచేది
వసంత ఋతువొక్కటే!
కానీ–
అందరినీ అన్నివేళలా
ఆహ్లాద పరిచేది
'అనురాగ గంగ'
నవలా రచయిత్రి
యద్దనపూడి
సులోచనా
రాణి
సరికొత్త నవల
ఋతువులు
నవ్వాయి
రూ.20/-
ఇప్పటికీ చదివి వుండ పోతే_
వెంటనే కొని చదవండి!
'మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే
నవల కాబట్టి అరువు తెచ్చు
కోకండి! అరువు ఇవ్వకండి!'
ఇది ఎమెస్కో వారి ఉవాచ!
ప్రతులకు:
ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతిరోడ్,
సికింద్రాబాద్-
500 003

చిన తలితండ్రులు. కట్టుకున్న భార్య. కన్నకొడుకు. అవన్నీ అసత్యం అనీ. ప్రణయ దేవత రేణు ఒక్కర్తే జీవిత సత్యం అనీ. ఆమె ద్వారా పొందే సుఖం స్వర్గధామమనీ నమ్మాడు. పదిమందిలో స్టయిలిష్‌గా కన్పించే రేణుని చూసి గర్వ పడ్డాడు. నౌసటను రూపాయంత బొట్టు పెట్టుకొని. పయిట భుజాన్నిండా కప్పుకొని మందంగా భర్తల వెనక నడిచే భార్యల్ని చూస్తే. ఆ భర్తలెంత దురదృష్టవంతులో అని జాలిపడ్డాడు. విశాలని తెచ్చుకొని వుంటే తన గతీ అంతే అయి వుండేది కదా అని అనుకున్నాడు. "రావ్!" అంటూ మత్తెక్కించేట్టు పిలిచే రేణుకి. 'ఏమండీ!' అని ఒదిగి ఒదిగి పిలిచే విశాలకీ వున్న తేడా గమనించి. తన జీవితం ధన్యమయిందని ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు శంకర్రావు.

సుఖాలు అనుభవించినన్నిరోజులు పట్ట లేదు. తనను కమ్మిన మైకపు పొరలు తొలగిపోవటానికి. ఎవరి సమక్షం అయితే స్వర్గం అని అనుకున్నాడో. అది నరకంగా మారటానికి ఎక్కువ కాలం పట్టలా! ఎవరయితే తన ప్రణయాధిదేవత అనుకున్నాడో ఆమె తన పాలిట రాక్షసరూపం దాల్చి వికటాట్టహాసం చేసిననాడు గానీ తన పొరపాటు తెలిసిరాలేదు. అయినా అన్నీ ఓర్చుకొని రేణుని ఆరాధిస్తూనే వచ్చాడు. తెలియని ఓ రకమైన బలహీనతకి లొంగిపోయాడు. ఏనాడూ తనకి ఒక కొడుకు ఉన్నాడని కానీ. ఒక భార్య వుందనిగానీ మనస్సులోకి కూడ రానివ్వలేదు మనస్ఫూర్తిగా రెండవ భార్య హతం అంతా భరిస్తూ ఓపిగ్గా కాలం నెట్టుకొంటూ వచ్చాడు. మనస్సు చంపుకొని మరమనిషిలా బ్రతికాడు. మరీ దారుణమయిన పరిస్థితులలో ఏడాదిక్రిందే ఇద్దరూ విడిపోయారు. ఇన్ని ఏళ్ళకు విశాల కన్పించింది.

* * *

ఏ కట్టు. ఏ బొట్టు తను అసహ్యించుకున్నాడో. ఏ వేషధారణ తనకి నచ్చదనుకున్నాడో అదే కట్టూబొట్టూతో ఈ నాటికి విశాల కన్పించింది. పవిత్రమైన దేవీ మూర్తిలా తోచింది విశాల ఫొటో వెతికి బయటకు తీశాడు. ఫొటోలో విశాల బొట్టు తనకంటే పాపాలన్నీ భగభగ మండించే నిప్పు కణికలా అలరారుతోంది. ఆమెను అందుకోలేనంత దూరంలో నిలబడవలసి వస్తూన్నది. ఈ శేష కాలాన్ని భార్య బిడ్డతో గడపాలని మనస్ఫూర్తిగా నిశ్చయించుకున్నాడు. తనని క్షమించమని. దగ్గిరకు తీసి సంతోషం కల్గించమని విశాలకి మళ్ళీ ఫోను చేశాడు శంకర్రావు.

ఏ విషయం మీకు కొద్ది రోజుల్లో రాస్తానండీ అని విశాల శంకర్రావు ఎడ్రసు తీసుకుంది. ఆమె వుత్తరం కోసం. తన భవిష్యత్తును నిర్ణయించే ఆ వుత్తరం కోసం క్షణమొక యుగంగా గడుపుతూ ఎదురు చూశాడు. ఎన్నిసార్లో అనిపించింది మళ్ళీమళ్ళీ విశాలకి ఫోను చేద్దామని! వారం తర్వాత విశాల దగ్గిర్నుంచి వుత్తరం వచ్చింది.

శ్రీ శంకర్రావు గార్కి-!

మళ్ళీ జీవితంలో ఇలా మనం ముఖాముఖి కలుసుకుంటామనిగానీ. మన మధ్య యిలాంటి పరిస్థితి వస్తుందని కానీ నేను ఏనాడూ వూహించలేదు. ఒకప్పుడు నా భర్తయిన మీరు ఆ స్థానాన్ని యింకెవరికో కట్టబెట్టి మళ్ళీ యిప్పుడు నన్ను మీతో అదే స్థానంలో వుండమంటున్నారు. దీనికి సమాధానం చెప్పాలంటే నా గాథ ఎంతయినా వున్నది. అయితే మీ ముందు నా గతాన్ని మళ్ళీ తవ్వుకోవాలని నా అభిమతం కాదు. అయినా కొన్ని ముఖ్య విషయాలు చెప్పక తప్పదు.

ఆ నాడు మీరు నన్ను విడాకులడిగారు. మీ కాళ్ళ మీద పడి వేడుకున్నా కాస్తయినా కనికరించలేకపోయారు. "పోనీ. మీ జీవితానికి అడ్డురాను! మీ బిడ్డ ముఖమయినా చూసి నాకు విడాకులివ్వకండి. భర్త వదిలేశాడన్న ముద్రయినా పర్వాలేదు. భర్తతో తెగతెంపులయిపోయాయనే మాట రానివ్వకండి" అంటే నిర్దాక్షిణ్యంగా. రాతపూర్వకంగా రాయించుకున్నారు. మన సమ్మంధం యింతేనా అంటే ఇంతేనని ఖచ్చితంగా చెప్పారు. నేను పడి ఏడుస్తూంటే. నా గుండెల్లో యింత బరువు నింపి కనికరం లేకండా దూరమయ్యాపు.

ఆడపిల్ల ఎంత మంచిదయినా. భర్త వదిలిపెట్టిన ఆడదానికి మన దేశంలో ఎంత విలువ వుంటుందో గ్రహించలేని తెలివి తక్కువవారు కారు మీరు. నిండు యౌవ్వనంలో వేయి లతలల్లుకుపోయే సమయాన నా జీవితానికి ఆలంబన లేకుండా చేశారు. నాకు తోడు కావలసింది యిప్పుడు కాదు. అభం శుభం తెలియని వయస్సులో. పసిబిడ్డతో నే పడిన అవస్థలు యిక్కడ వివరించటానికి కూడ నాకు ఓపిక లేదు.నాబిడ్డకి తండ్రి లేడు. నాకు భర్త లేడు; అని మనసు రాయి చేసుకొని ఆత్మీయులకీ. అనురాగాలకీ దూరమయి బ్రతికాం యిన్నిరోజులు!

మీరు ఫోనుచేసి "గుర్తున్నానా విశాలా!" అని అడిగారు. రాముడనేవాడు గుర్తున్నన్ని రో జు లూ రా వ ణా సు రు ణ్ణి

మరిచిపోరు ప్రజలు! అలాగే ఒక ఆడపిల్ల తనకి అనురాగం అందించిన పురుషుడికంటె తన సర్వస్వాన్నిదోచుకొని నట్టేట ముంచిన పురుషుడినే ఎక్కువగా గుర్తు పెట్టుకొంటుంది. ఒకవేళ మరిచిపోదామన్నా ఆ అమ్మాయికి ఎదురయ్యే పరిస్థితులు అడుగడుగునా అందుకు కారణమయిన వారిని గుర్తుకు తెస్తూనే వుంటాయి. ఇప్పుడు అర్థమయిందనుకొంటాను మీరు నాకే రకంగా గుర్తువున్నారో.

అయితే మిమ్మల్ని నేను ఎప్పుడూ నాకు కల్గిన దురదృష్టానికి శపించలేదు. దేవుడనేవాడు వున్నాడో,లేదో నాకు తెలీదు. అలాగే మన తప్పొప్పుల్ని దేవుడిముందు నిలబడి చెప్పుకునే సమయం వస్తుందో. రాదో నాకు తెలియదు. కాని మనం నమ్మే దేవుడు వుండటమే నిజమయితే ఆ దేవుడు ప్రతీ మనిషిలో వున్నాడని అనుకుంటే. అదే మన అంతరాత్మ. ఆ అంతరాత్మకున్న శక్తిమరి దేనికీ లేదని నా నమ్మకం. దేనికి సమాధానం చెప్పినా,చెప్పకపోయినా మన అంతరాత్మకి మనం సమాధానం చెప్పుకోగలిగితే చాలు. ఎవరయినా ఏదైనా పాపంచేస్తే. వారి అంతరాత్మే వారిని నిద్రపోనియ్యదని. ఎందర్ని మోసం చేసినా అంతరాత్మని మాత్రం మోసం చెయ్యలేరని. ఎవరూ విధించలేని శిక్ష వారి అంతరాత్మే వారికి విధిస్తుందని నా నమ్మకం.

ఇన్ని సంవత్సరాల తర్వాత మీరు రమ్మనగానే మీ పాదాల మీద వాలి నా పతిభక్తిని నిరూపించుకోవాలని నాకేమాత్రం లేదు. నేనంతటి పతివ్రతని కాను. కాలేను. వయసులో ఎన్నో అవసరాలుంటాయి. ముఖ్యంగా ఆ వయసుకి రక్షణ అవసరం. కోటి కోర్కెలతో. వెలలేని సౌభాగ్యంతో పచ్చగా కళకళలాడవలసిన నా జీవితం భగ్గున మాడిపోయింది. చిన్నవయసులో నలుగురితోపాటు మామూలుగా ఆడుతూ పాడుతూ పెరగవలసిన నా బిడ్డ ఎన్నో యిక్కట్లు అవమానాల పాలయ్యాడు. ఆ రోజుల్లో అవసరానికి రాని నా భర్త ఇప్పుడు నాకు ఏ రకంగానూ అవసరంలేదు. అలాగే నా బిడ్డకి తండ్రి అవసరమూ తీరిపోయింది. విడిపోయిన సంబంధాలు కలుపుకోవాలని గానీ. ఒక వ్యక్తి దౌర్జన్యానికి బలి అయిన నా సౌభాగ్యాన్ని మళ్ళీ వెదికి తెచ్చుకోవాలని గానీ నాకే కోశానా లేదు.మన సంబంధానికి గతమే కాని భవిష్యత్తు లేదని నేను ఏనాడో నిర్ణయించుకున్నాను. ఇంతకన్నా నేను మీకు చెప్పగలిగింది ఏమీలేదు. సెలవ్.

విశాల

